## కేసీఆర్ చేతుల్లోనే తెలంగాణ సురక్షితంగా ఉంటుంది

- ప్రజల ఆశీర్వాదంతో కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం పక్కా
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రాల్లో రోడ్‌షో
- బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డితో కలిసి పాల్గొన్న మంత్రి




అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావు, భారీగా హాజరైన జనం, రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి

# దుబ్బాకను రెవెన్యూ డివిజన్ చేస్తాం

- మోసపోతే గోస పడుతం
- అభివృద్ధే బీఆర్ఎస్ ఎజెండా
- కారు గుర్తుకు ఓటెయ్యాలి

దుబ్బాక/మిరుదొడ్డి, నవంబర్ 22: పుట్టిన బిడ్డ తల్లి చేతుల్లో ఉన్నట్లుగా.. తెలంగాణ కేసీఆర్ చేతుల్లో ఉంటేనే సురక్షితంగా ఉంటుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ కావడం పక్కా అన్నారు. బుధవారం దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి, అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రాల్లో నిర్వహించిన రోడ్ షోకు బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. దుబ్బాక ఉప ఎన్నికలో బీజేపీ నాయకుడు అరచేతిలో వైకుంఠం చూపించి మోసం చేశాడని, గెలిచిన మూడేండ్లలో దుబ్బాకలో ఒక్క పనైనా చేసిండా ప్రజలు ఆలోచించాలన్నారు. మోసపోతే గోస పడుతామని, దుబ్బాక అభివృద్ధి కావాలంటే.. కారు గుర్తుకు ఓటేసి మన ప్రభాకరన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఓ దుండగుడు ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో అమానుషంగా దాడి చేసి హత్యయత్నానికి పాల్పడ్డాడని, భగవంతుడి ఆశీస్సులతో పునర్జన్మ ఎత్తాడన్నారు. ఎండకాలంలో కూడవెల్లి వాగు పారుతుందని కలగన్నామా? కాళేశ్వరంతో ఎక్కడ చూసినా జలకళతో చెరువులు, కుంటలు, పచ్చదనంతో పాడిపంటలు కన్పిస్తున్నాయన్నారు. పని చేసే బీఆర్ఎస్‌ను కాదని బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటేస్తే దున్నపోతుకు గడ్డి వేసి, బర్రెకు పాలు పిండినట్లుగా ఉంటుందని సూచించారు. ఈ ఎన్నికలో ప్రభాకరన్నను భారీ మెజార్టీతో గెలిపించి, దుబ్బాక గడ్డపై గులాబీ జెండా ఎగురేయాలని పిలుపునిచ్చారు.




మిరుదొడ్డిలో మంత్రి హరీశ్‌రావు రోడ్ షోకు భారీగా హాజరైన జనం, ప్రజలతో కరచాలనం చేస్తూ ముచ్చటిస్తున్న మంత్రి

### దుబ్బాక రెవెన్యూ డివిజన్ నా బాధ్యత!

దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా చేసే బాధ్యత తనదని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. దుబ్బాకను రెవెన్యూ డివిజన్ చేయడంతో పాటు కూడవెల్లి రామలింగేశ్వరాలయాన్ని అభివృద్ధి చేసి పర్యటక కేంద్రంగా మారుస్తామన్నారు. ప్రతి గ్రామంలో మహిళా సమాఖ్య భవనాలు నిర్మిస్తామన్నారు. ప్రతి కుటుంబానికీ కేసీఆర్ బీమా అందించి అండగా ఉంటామన్నారు.

### కాంగ్రెస్ హయాంలో అరిగోస పడ్డాం

కాంగ్రెస్ హయాంలో సర్కారు దవాఖానలు అధ్వానంగా ఉండేయని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో దుబ్బాకలో వంద పడకల దవాఖానను నిర్మించుకున్నామని, గరీబోళ్లకు మంచి వైద్యం అందుతుందని మంత్రి అన్నారు. బాయిల కాడ కావలి ఉండి పంటకు నీరు పెట్టే పరిస్థితి ఇప్పుడు లేదన్నారు. 24 గంటల కరెంటుతో సమృద్ధిగా పంటలు పండుతున్నాయని తెలిపారు. కూడవెల్లి వాగులో చెక్ డ్యాంలు పొంగిపొర్లుతున్నాయని, ఎండకాలంలో సైతం కూడవెల్లి వాగు మత్తడి దుంకిందని చెప్పారు. మల్లన్నసాగర్‌తో రెండు పంటలు పండించుకుంటున్నామన్నారు. తెలంగాణలో సీఎంగా కేసీఆర్.. దుబ్బాకలో ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్‌రెడ్డి(కేపీఆర్ ) గెలుపొందడం ఖాయమన్నారు. కార్యక్రమంలో దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### మేము చేసిన పనుల వద్ద కొబ్బరికాయ, కత్తెరతో ముందుండవట్టే..

దుబ్బాకలో మేము చేస్తున్న పనులకు మాకంటే ముందే వచ్చి కొబ్బరికాయలు, కత్తెర పట్టుకుని నిలబడుతున్నాడని ఎమ్మెల్యే రఘునందన్‌పై మంత్రి మండిపడ్డారు. ఎంపీ ప్రభాకర్‌రెడ్డి చొరవతో అక్బర్‌పేట–భూంపల్లి మండలం ఏర్పాటు జరిగిందన్నారు. ఇది కూడా తనవల్లనే అయ్యిందంటూ రఘునందన్ చెప్పుకోవటం సిగ్గుచేటన్నారు. దుబ్బాకలో ఓ మంచి మనిషికి.. కోతల రాయుడికి జరుగుతున్న పోరాటమన్నారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే పింఛన్ రూ.5 వేలు, రైతుబంధు ఎకరానికి రూ.16 వేలు, రూ.400కే గ్యాస్ సిలిండర్, రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు చెందిన అసైన్డ్ భూములను పట్టాలుగా మార్చి హక్కులు కల్పిస్తామన్నారు.

# ప్రజా ఆశీర్వాదమే నా బలం

### బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక టౌన్, నవంబర్ 22: దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నంబర్ వన్ స్థానంలో నిలుపుతానని, అందుకు ప్రజలందరూ ఆశీర్వదించాలని బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ సహకారంతో దుబ్బాకను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. బుధవారం స్థానిక భవన నిర్మాణ సంఘం, అంబేద్కర్ సంఘం నాయకులు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతు తెలిపారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌కు రెండు కండ్లలాంటివని, బీఆర్ఎస్‌కు ప్రజలే బాస్‌లని, కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్‌కు దుబ్బాకపై ఎంతో ప్రేమ ఉందని, వచ్చే రోజుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు వంశీకృష్ణ, నాయకులు రొట్టె రాజమౌళి, బండి రాజు, బట్టు ఎల్లం, కొట్టె రాజు, దేవుని రాజు, కొట్టె ఇందిర, భూంరెడ్డి, కౌన్సిలర్లు ఆస యాదగిరి, స్వామి, కాల్వ లింగం, సురేశ్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్న అంబేద్కర్ సంఘం బాధ్యులు



దౌలాపూర్‌లో కళాకారులతో కలిసి కోలాటం ఆడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

# ఇంటి పార్టీ బీఆర్ఎస్‌ను గెలిపిద్దాం

- ఢిల్లీ గులాములను తరిమేద్దాం
- లక్ష ఓట్లకు పైగా మెజార్టీతో కేసీఆర్‌ను గెలిపించుకుందాం
- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి ఘన స్వాగతం

జగదేవ్‌పూర్, నవంబర్ 22: అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి పేదలకు అండగా నిలిచే మన ఇంటి పార్టీ బీఆర్ఎస్‌ను గెలిపిద్దాం.. ఢిల్లీ గులాములను తరిమేద్దామని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అంతాయగూడెం, మాందాపూర్, పలుగుగడ్డ, కొండాపూర్, దౌలాపూర్, గొల్లపల్లి, నిర్మల్‌నగర్, అలిరాజ్‌పేట గ్రామాల్లో మండల, గ్రామ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో జగదేవ్‌పూర్ మండలంలోని పల్లెలు ఏవిధంగా ఉండే..? ఇప్పుడు ఎలా అభివృద్ధి చెందాయో ప్రజలు ఆలోచించాలన్నారు. కేసీఆర్‌తోనే గజ్వేల్ అభివృద్ధి చెందిందని, లక్ష ఓట్లకుపైగా మెజార్టీతో సీఎం కేసీఆర్‌ను గెలిపించాలన్నారు. గడపగడపకూ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నరేశ్, ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, కొండపోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలేశంగౌడ్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, సర్పంచ్‌లు సత్యం, భిక్షపతి, రాజేశ్వరీరవి, జహంగీర్, వంటేరు శ్రీనివాస్‌రెడ్డి, మమతాఅంజిరెడ్డి, మునిగడప ఎంపీటీసీ కిరణ్, నాయకులు ఎంపీటీసీ దర్గయ్య, మహేందర్, సిద్దులు, బుద్ద నాగరాజు, ఆంజనేయులు, కనకయ్య, గణేశ్, భాను, ఐలయ్య, యాదగిరి, రాజు పాల్గొన్నారు.

# బీజేపీకి జిల్లా అధికార ప్రతినిధి గుడ్ బై

### మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

సిద్దిపేట, నవంబర్ 22: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కొండూరి మహేశ్, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సాయి, వెంకట్ బీజేపీకి తన అనుచరులతో కలిసి రాజీనామా చేశారు. బుధవారం సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి హరీశ్‌రావు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.

